# హిందూ వేదములందు నిర్దేశించబడిన యజ్ఞమును యేసుక్రీస్తు నెరవేర్చెను.

శ్రీ ఎమ్. ఎన్. పాల్ అను నేను జూలై 1992 నుంచి మే 1995 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వ సంస్థయగు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ బోర్డులో మెంబరు (ప్రాజెక్ట్స్)గా పనిచేసితిని. మే నెల 1995లో పదవీ విరమణానంతరమునుండి హైదరాబాదులోనే నివాసముంటున్నాను. ప్రస్తుతము బిబిఐ పవర్ అనునొక మేరీలాండ్, అమెరికా వారి హిందూ దేశపు ఆఫీసులో పనిచేస్తున్నాను.

మా పూర్వీకులు మహారాష్ట్రదేశమున ప్రఖ్యాతిగాంచిన ఛత్రపతి శివాజీ మహరాజు గారి ఆస్థానమందు అశ్వదళములోని వారు. ఆ రాజ్య పతనమప్పుడు ఆంగ్లేయులారాజ్య యుద్ధదళములన్నింటినీ విచ్ఛిన్నమొనర్చి, సిపాయిలు దేశమంతటా చెల్లాచెదరైపోయిరి. దాదాపు 250 సంవత్సరముల క్రితమాలాగు చెదరిపోయి ఆంధ్రదేశమందు స్థిరపడిన క్షత్రియ వంశజుడనేను.

కీర్తిశేషులైన శ్రీ ముక్త్యాల వెంకటేశ్వరరావుగారూ, కీర్తిశేషులు శ్రీమతి జగ్గమ్మగారూ నా పూజ్య జననీజనకులు. నాయన్నగారైన శ్రీ వీరరాజుగారు ఆగష్టునెల 1930లో జన్మించి, 1950లో కాకినాడలోని ఇంజనీరింగు కళాశాలలో సివిల్ ఇంజనీరింగునందు పట్టాపుచ్చుకొనిరి. ఆయన నీటిపారుదల శాఖలో ఛీఫ్ ఇంజనీరుగానూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వములో ఛీఫ్ టెక్నికల్ ఎక్జామినర్‌గానూ పనిచేసి 1988లో పదవీ విరమణ చేసి కాకినాడలో స్థిరపడిరి. నేను 1936వ సంవత్సరము నవంబరునెల 15 తేదీన జన్మించితిని. కాకినాడలోని ఇంజనీరింగు కళాశాలలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగునందు 1958 సంవత్సరమున పట్టభద్రుడనైతిని. నా చెల్లి జూన్ నెల 1940లో జన్మించినది. ఆమె భర్తగారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వములో డిప్యూటీ సివిల్ సర్జనుగా పనిచేసి పదవీ విరమణానంతరము కాకినాడలో స్థిరపడినారు.

నా తలిదండ్రులు నిష్ఠాగరిష్ఠులైన హిందువులు. నా తండ్రిగారు కాకినాడలోని

పీఠికాపురాధీశ కళాశాలలో ఇంటర్మీడియేట్ చదువుచున్న రోజులలో, బ్రహ్మసమాజ బోధలచేనాకర్షింపబడిరి. అందుచే ఆయనకు హిందూత్వముపై నున్న విశ్వాసము నెమ్మదినెమ్మదిగా వీర్సపడనారంభించినది. కీర్తిశేషులైన శ్రీ ఎన్. దానియేలుగారు (LEF స్థాపకులు) నా తండ్రిగారి సహాధ్యాయులు. ఆయన నా తండ్రిగారికి యేసుక్రీస్తును గూర్చిన సువార్తనందించిరి. నా మతామహుని తమ్ముడొకడు నాస్తికుడు. ఆయన నా తండ్రిగారు క్రైస్తవ్యమువైపు మొగ్గుచున్నారని తెలిసికొని, ఇంగరుసాలువంటి గొప్ప వ్యక్తులు క్రైస్తవ్యమును ఖండించుచూ వ్రాసిన పుస్తకముల యనేకముల చదివించెను. ఇది గమనించి శ్రీ దానియేలుగారు ఇంగరుసాలుల మించిన విద్యావేత్తలగు బైబిలు పండితులు వ్రాసిన పుస్తకములను నా తండ్రిగారిచే చదివించిరి. ఈ పుస్తకములన్నింటినీ చదువుటచే నా తండ్రిగారు మిక్కిలి కలవరపడి, యిది పనికాదని, తనంతటతనే హిందూ మతగ్రంథములనూ, ఇంగ్లీషు భాషలోనికనువదించబడిన కురానునూ, బైబులునూ చదివి సత్యాన్వేషణగావించవలెననెడు దృఢ సంకల్పముతో 25 సంవత్సరముల శ్రమ ఫలితముగా యేసుక్రీస్తునందే తనయన్వేషణకు సమాధానమున్నదని నిర్ధారించుకొనిరి.

ఆ రోజులలో మా కుటుంబములలోనియాచారములబట్టి ఆడ పిల్ల 10 వత్సరముల వయసు వచ్చిన పిదప ఇంటి నాల్గు గోడల లోపలనుండవలసినదే గాని యింటి వీధియరుగు మీదకైనను వెళ్ళవలసి పడదు. కనుక నా తల్లిగారు ఐదవ తరగతి మాత్రమే చదువుకోగల్గినది. పదిసంవత్సరముల వయసు రాగానే ఆడపిల్ల వివాహ యేర్పాట్లు చేయనారంభించుట విధి. చదువునాపి పూజాపునస్కారముల చేయనేర్పెడివారు. నా తల్లిగారికీ ఆమె యిద్దరు అక్కలకూ యింటిలోని వృద్ధస్త్రీలూ, పురోహితులూ పూజలు పునస్కారముల చేయనేర్పెడివారు. అందువలన నా తల్లి చాల నిష్ఠగల హైందవ స్త్రీయైనది. బ్రాహ్మల తర్వాత రెండవ యున్నత కులమగు క్షత్రియ వంశజురాలగుటచే అంటరాని తనమను సాంఘిక దురాచారమును నా తల్లి ఆచరించెడిది. నా తల్లికి 12 వత్సరముల యీడు రాగానే నా మాతామహుడామెకు వివాహము చేసెను. అప్పటికి నా తండ్రిగారింకనూ విద్యార్థియైయుండియు తన సత్యాన్వేషణలో నిమగ్నమైయుండెను.

ఈ పరిస్థితులలో, సహజముగనే నా తల్లి బిడ్డలమైన మమ్మును తను పెంచబడి నట్లే పెంచెను. నా తల్లి నన్నెంతో ప్రేమించెడిది. నేను కూడ నా తల్లిని చాల ఎక్కువగా ప్రేమించితిని. కనుక నా తల్లి ప్రభావము నా పైయధికముగానుండెను.

నా తండ్రి క్రీస్తు ప్రభువును కనుగొనిన పిదప ఆయన నా తల్లికి యేసు క్రీస్తు సువార్తను బోధించెను. "ప్రజాపతిర్దేవేభ్యం ఆత్మానం కృత్వాప్రాయశ్చిత్తః" అని వేదములలో చెప్పబడినది యేసు క్రీస్తునందు నెరవేరినదనిన్నీ, " అసతోమా సద్గమయ; తమసోమా జ్యోతిర్గమయ; మృత్యోర్మా అమృతంగమయ" అని మన దేశపు ఋషులు చేసిన ప్రార్థనకు యేసుక్రీస్తు చెప్పిన " నేనే మార్గమును, సత్యమును, జీవమును" అనునది ఖచ్చితమైన జవాబనియూ, " నా ద్వారానే తప్ప ఎవడును తండ్రి(దేవుని) దరికి రాలేడ"నీ " నా యందు విశ్వాసముంచు వాడు చీకటిలో నుండకుండునట్లు నేనీ లోకములోనికి వెలుగుగా వచ్చితిననీ" యేసు క్రీస్తు చెప్పిన వర్తమానమును నా తల్లికి విశదీకరించిరి. అంటరాని కులములవారి దైవమును గూర్చి తన భర్త తనకు బోధించుటయునూ, ఆయన చెప్పిన విషయములు వేదములననుసరించినవేయగుటచే నా తల్లి ఆయోమయములోపడినది. కొంతకాలమునకు సందేహనివృత్తియై, తన మనసులో యేసు క్రీస్తునంగీకరించెను. కాని, కులకట్టుబాట్లవలన, పిల్లల భవిష్యత్తును గూర్చిన భయముతో బహిరంగముగా క్రీస్తునంగీకరించ సాహసించలేకపోయెను. అందువలన నా తల్లి తనయక్కగారితో నన్ను హిందూ దేవాలయములకూ, పండుగలకూ పబ్బములకూ పంపుచుండెడిది. ఈ పరిస్థితుల ప్రభావమున నాలో కుల వ్యత్యాసములు చోటు చేసుకున్నవి.

చాల సంవత్సరములు నా తలిదండ్రులు పిల్లల భవిష్యత్తును గూర్చి ఎంతగనో యాలోచించి, తమతోబాటు పిల్లలనుకూడ క్రైస్తవులను చేయుటయా మానుటయా యను ప్రశ్నతో సతమతమగుచు ఎటూ తేల్చుకొనలేకయుండిరి. క్రైస్తవులయినవెంటనే కులమునుండి వెలివేతురు గనుక పిల్లల వివాహముల విషయము కూడ నా తలిదండ్రులను కలవరపెట్టుచుండెను. బ్రాహ్మలుగా జన్మించి క్రైస్తవులైన నా తండ్రిగారి స్నేహితులు నా తల్లిగారికి బోధింపగా నెట్టకేలకు నా తల్లి పిల్లలమూ క్రైస్తవులము చేయుటయే మార్గమని

నిశ్చయించుకొనినది. నా తండ్రిగారు చాలకాలముగా యీయభిప్రాయముతోనే యుండిరి.

నా తలిదండ్రులూ, వారితోబాటు అప్పటికి 13 వత్సరముల వాడైన నా యన్నగారూ, 7 సంవత్సరముల వాడనైన నేనూ, మూడేండ్లయీడుగల నా చెల్లియు 27 ఫిబ్రవరి 1944 నాడు బాప్తిస్మము పొంది క్రైస్తవులమైతిమి.

నా తల్లి ఎంత నిష్ఠతో హిందూ దైవముల నారాధించెడిదో, యేసు క్రీస్తునంగీకరించినప్పటినుండి అంత నిష్ఠతోనూ ఆయనను వెంబడించినది. బిడ్డలమైన మమ్మును కూడ భక్తి విశ్వాసములుగల క్రైస్తవులుగా పెంచనెంతో శ్రమపడినది. దేవుడాత్మగనుక మనమాయనను ఆత్మతోనూ సత్యముతోనూ ఆరాధింపవలయుననియూ, విగ్రహారాధన దేవునికసహ్యమనియు మాకు గట్టిగా బోధించెడిది. ప్రతిదినోదయమున యింటిలో బైబిలు చదువుకొని ప్రార్థించు కొనుటనూ, ప్రతియాదివారమూ సండేస్కూలుకునూ, చర్చిలో ఆరాధనకు వెళ్ళుటనూ, క్రైస్తవ సభలకు వెళ్ళుటనూ బిడ్డలమైన మాకు నేర్పినది. నేను నా తల్లినెంతో ప్రేమించుటచే నా తల్లి నేర్పిన యేసు క్రీస్తునందలి విశ్వాసమందు ఎదుగవలెనని కోరితిని. కాని బడిలోని సహాధ్యాయుల ప్రేరణవలన మా యితర బంధువులవలె హిందూమత పద్ధతులనేయాచరింపవలెనా (మా బంధువులందరూ యీనాటికీ హిందువులే!) లేక నా తల్లి నేర్పిన క్రీస్తు బాటలో నడువవలెనా యన్న ప్రశ్ననెటూ తేల్చుకోలేక సందిగ్ధములో పడితిని.

1946 సంవత్సరములో నా తల్లికి గర్భాశయములో నొక కణితి(ఫైబ్రాయిడ్) పెరుగుచున్నదని వైద్యులు నిర్ధారించిరి. ఆ సమయములో నా మేన మామగారి కుమారుడు (చాల సంవత్సరముల తరువాత యీయనే నా చెల్లిని వివాహమాడిరి.) విశాఖ పట్టణములోని కింగ్ జార్జి ఆసుపత్రి మరియు వైద్య కళా శాలలో వైద్యవిద్య నభ్యసించుచుండెను. ఆయన నా తల్లిని సుప్రసిద్ధ గైనకాలజిస్టుగారునూ, ఆ వైద్య కళాశాలలో గైనకాలజీ ప్రొఫెసరుగారునైన డాక్టరు శ్రీమతి లాజరస్ అమ్మగారికి చూపించి పరీక్ష చేయించిరి. నా తల్లిగారికప్పటికే

చాల రక్తలేమి ధశ వ్యాపించినది(ఎనిమిక్). డా. లాజరస్ అమ్మగారిచ్చిన మందులేవియు ఆ రక్తలేమిని కుదర్చలేకపోయినవి. కనుక ఆ డాక్టరమ్మగారు నా బావగారితో " రక్తలేమి వలన మీయత్తకు ఆపరేషను చేస్తే ఆ బల్లమీదనే చని పోతుంది. ఆపరేషను చేయకపోతే ఆరు నెలలకన్న జీవించజాలద"ని వివరించిరి. నా తలిదండ్రులూ, అనేకమంది క్రైస్తవ విశ్వాసులూ, పరిశుద్ధులూ చేసిన ప్రార్థనలను దేవుడాలకించినాడు. అద్భుతమునే చేసినాడు దేవుడు. నా తల్లిగారు 1983 సంవత్సరము ఫిబ్రవరినెలలో, అనగా డాక్టరుగారిచ్చిన గడువుకన్న 37 సంవత్సరములు పూర్ణారోగ్యంతో జీవించి, తనెంతో ప్రేమించిన యేసు క్రీస్తు రాజ్యములోనికి వెళ్ళినది. ఈ గొప్పయద్భుతము యేసు క్రీస్తు ప్రార్థనల నాలకించి జవాబులిచ్చువాడని నాకు నిరూపించి నా జీవితము మీద గొప్ప ప్రభావము కలిగించినది. కాని నా హృదయము పాపపుటాలోచనలతోనూ, పాపముతోనూ నిండియుండెను. కొంతమంది స్నేహితుల ప్రోద్భలమున నేనక్రమ మార్గములనవలంబించనారంభించితిని. నా తలిదండ్రులనానందింపజేసి మోసపుచ్చుటకు యింటి దగ్గర బైబిలును చదువుకొని ప్రార్థనచేయుచుంటిని. కాని బడికి వెళ్ళగనే నేను వేరు ప్రవర్తన గలవాడనవుచుంటిని. నా హృదయమొక పాషాణము(బహు కఠినమైనది) వంటిదై బహువేషధారణతో నిండియుండెను.

1950-'54 సంవత్సరములలో నేను బాయిస్ స్కౌటుగానుంటిని. మా హైస్కూలునుండి స్కౌటులను, పండుగలప్పుడు దేవాలయములకు వచ్చు యాత్రికులకు సహాయము చేయుటకు పంపుచుండిరి. ఈ దేవాలయములు పంటకాల్వలయొద్దనుండుటచే యాత్రికులా కాల్వలలో స్నానముచేసి దైవ దర్శనమునకేగెడివారు. కొన్ని దేవాలయములలో పుష్కరిణులుండెడివి(కొలను). వాటిలో కూడ వేలాది భక్తులు స్నానములు చేసెడివారు. ఆ దేవాలయముల యొద్ద స్కౌటునైన నేనున్నప్పుడు యీ వేలాది భక్తులు స్నానము చేయుచున్న కాల్వలలోని నీరునూ, పుష్కరిణు(కొలను)లలో నీరూ చాల కలకలుగుట చూచితిని. ఈలాటి నీరొకని శరీరమునైననూ సరిగా శుభ్రము చేయలేదుకదా, మరిమనయాత్మలకున్న పాపమునెట్లు కడుగగలదనెడు ప్రశ్న నాలోనుద్భవించెను.

నా తండ్రిగారు 1947 నుండి 1951వరకు తూర్పుగోదావరిజిల్లా రామచంద్ర పురములోనూ పెద్దాపురములోనూ ఉద్యోగరీత్యా పనిచేసిరి. ఆ ఊరులలోని యున్నత పాఠశాలలలో నేను చదువుచుండగా నా సహాధ్యాయులు దగ్గరలో నున్న పల్లెటూళ్ళనుండి వచ్చెడివారు. వారి పండుగలప్పుడు వారితోనొక రోజు గడుపుటకు నన్నాహ్వానించెడివారు. ఆ పండుగలప్పుడు ఆ పల్లెలలో దేవతలకు కోళ్ళనూ, మేకపోతులనూ, గొర్రె పొట్టేళ్ళనూ బలులర్పించెడివారు. ఈ జంతుబలులగురించియూ, యీ పూజాపునస్కారాచారముల గురించియూ నాకేపాటియు అర్థమవలేదు సరికదా యీ విషయములు నన్ను బహుగా వేదించుచుండెను. నా తండ్రిగారితోనీ విషయముల ప్రస్తావించి వాటిని వివమరచి చెప్పుమనగా, ఆయన వేదములనుంచీ బైబిలునుంచీ యీ క్రింది విధమున విశదీకరించిరి.

| క్రమ సంఖ్య | సంస్కృత శ్లోకము | తెలుగు అనువాదము |
|---|---|---|
| 1. | " యజ్ఞో వై-భువనస్యనాభిః" (ఋగ్వేదము 1.164:25) | లోకమునకు యజ్ఞము వెన్నెముక వంటిది. |
| 2. | " సర్వ పాపపరిహారో రక్తప్రోక్షణ మవశ్యం తద్ రక్తం పరమాత్మేన పుణ్యదాన బలిదానం" (తాండీయ మహాబ్రాహ్మణము. సామవేదము.) | పాపపరిహారము కొరకై రక్తము చిలుకరించుట యవసరము. ఆ రక్తము దేవుడు తనను తను బలిగానర్పించుట వలననైనదే. |
| 3. | " ప్రజాపతిర్దేవేభ్యం ఆత్మానం యజ్ఞం కృత్వా ప్రాయచ్ఛత్." | మానవాళి పాపప్రాయశ్చిత్తార్థము ప్రజాపతే తను యజ్ఞముగా నర్పించుకొనెను. |
| 4. | " ప్రజాపతిర్యజ్ఞః" | ప్రజాపతే యజ్ఞము. |

| | | |
|---|---|---|
| 5. | " యజ్ఞోవా అవతి తస్యఛాయా క్రియతే." | ఆచరణలోనున్న యజ్ఞము లన్నియు ఆ మహోత్కృష్ట యజ్ఞపుఛాయలు మాత్రమే. |
| 6. | " నకర్మణా మనుష్ఠానైర్నదానై ర్నజాపివాకైవల్యం లభతే మర్త్యః". | తీర్థయాత్రల వలనగాని, స్నానముల వలనగాని, దానధర్మాదుల ననుస రించుటవలనగాని పాపపరిహారము కలుగదు. |

తదుపరి నా తండ్రిగారు నా చేత బైబిలు గ్రంథమందలి యెషయాయను ప్రవక్తచే రచింపబడిన పుస్తకము 53 అధ్యాయము 5వ వచనమునుండి 12వ వచనము వరకు చదివించిరి. ఆ భాగమందీలాగున వ్రాయబడియున్నది: " మన యతిక్రమ క్రియలను బట్టి అతడు గాయపరచబడెను. మన దోషములనుబట్టి నలుగ గొట్టబడెను. మన సమాధానార్థమైన శిక్ష అతని మీద పడెను. అతడు పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగుచున్నది. మనమందరము గొఱ్ఱలవలె త్రోవ తప్పిపోతిమి. మనలో ప్రతివాడును తనకిష్టమైన త్రోవకు తొలగెను. యెహోవా మనందరి దోషమును అతనిమీద మోపెను. అతడు దౌర్జన్యమునొందెను. బాధింపబడినను అతడు నోరు తెరువలేదు. వధకు తేబడు గొఱ్ఱపిల్లయు, బొచ్చు కత్తిరించువానియెదుట గొఱ్ఱయు మౌనముగానుండునట్లు అతడు నోరు తెరువలేదు. అన్యాయపు తీర్పునొందినవాడై అతడు కొనిపోబడెను. అతడు నా జనుల యతిక్రమమునుబట్టి మొత్తబడెనుగదా. సజీవుల భూమిలో నుండి అతడు కొట్టివేయబడెను. అయినను అతని తరమువారిలో యీ సంగతి ఆలోచించిన వారెవరు? అతడు మరణమైనప్పుడు భక్తిహీనులతో అతనికి సమాధి నియమింపబడెను. ధనవంతునియొద్ద అతడు ఉంచబడెను. నిశ్చయముగా అతడు అన్యాయమేమియు చేయలేదు. అతని నోట ఏ కపటమును లేదు. అతని నలుగగొట్టుటకు యెహోవాకు యిష్టమాయెను. ఆయన అతనికి వ్యాధి కలుగజేసెను. అతడు తనకు తానే అపరాధ పరిహారార్థ బలి చేయగా అతని సంతానము చూచును. అతడు దీర్ఘాయుష్మంతుడగును, యెహోవా ఉద్దేశము అతని వలన సఫలమగును. అతడు తనకు కలిగిన వేదనను చూచి తృప్తి

నొందును. నీతిమంతుడైన నా సేవకుడు జనుల దోషములను భరించి తనకున్న అనుభవ జ్ఞానముచేత అనేకులను నిర్దోషులనుగా చేయును. కావున నేనతనికి గొప్పవారితో పాలుపంచి పెట్టెదను. ఘనులతో కలిసియతడు కొల్లసొమ్ము విభాగించుకొనును. ఏలయనగా మరణమునొందునట్లు అతడు తన ప్రాణమును ధారపోసెను. అతిక్రమముచేయువారిలో ఎంచబడినవాడాయెను. అనేకుల పాపమును భరించుచూ తిరుగుబాటు చేసిన వారిని గూర్చి విజ్ఞాపనము చేసెను". ఈ భాగమును నేను చదివిన తర్వాత నా తండ్రిగారు వేదములలోని విషయములూ బైబిలులోని విషయములూ ఎంత చక్కగా ఏకీభవించుచున్నవో వివరించిరి. మొదటిదిగా రక్తము చిందించకుండ పాప క్షమాపణ కలుగదనీ, రెండవదిగా పాపక్షమాపణకు యజ్ఞమవసరమనీ, మూడవదిగా మానవాళి యందరి ప్రాయశ్చిత్తార్థమై దేవుడే తన శరీరమును యజ్ఞము గావించివాడనీ విపులపరచిరి.

అపుడు నా తండ్రిగారు వేదములనుంచి మరిన్ని శ్లోకములనూ బైబిలునుంచి యనేక వాక్యములనూ చదివి " పరమాత్మేవ పుణ్యదాన బలియాగం" అను శ్లోకమునూ, " ప్రజాపతిర్యజ్ఞః" అను శ్లోకమునూ యేసుక్రీస్తుయొక్క సిలువ మరణములో నెరవేర్చబడినవని నిరూపించిరి. నా తండ్రిగారు మరికొన్ని శ్లోకములను చదివి వధించబడిన బలి పశువు తిరిగి బ్రతికించబడవలెననీ, ఆ బలిపశుమాంసమును యజ్ఞము చేసిన వారందరూ భుజించవలెననీ చెప్పిరి. అపుడు నా తండ్రిగారు నన్ను బైబిలులోని మత్తయి సువార్త యను పుస్తకమందలి 26వ అధ్యాయము 26, 27, 28 వచనములు చదువుమనిరి. ఆ భాగమందీ విధముగా వ్రాయబడియున్నది: " వారు భోజనము చేయుచుండగా యేసు ఒక రొట్టె పట్టుకొని, దానినాశీర్వదించి, విరిచి తన శిష్యులకిచ్చి - మీరు తీసికొని తినుడి; ఇది నా శరీరమని చెప్పెను. మరియు ఆయన గిన్నె పట్టుకొని, కృతజ్ఞతాస్తుతులు చెల్లించి, వారికిచ్చి - దీనిలోనిది మీరందరూ త్రాగుడి. ఇది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము."

తరువాత నా తండ్రిగారు బైబిలులోని లూకా సువార్తయను పుస్తకములోని 22వ

అధ్యాయము 19వ వచనము చదివిరి. ఆ భాగమునందు యీ విధముగా వ్రాయబడియున్నది: "పిమ్మట ఆయన యొక రొట్టె పట్టుకొని కృతజ్ఞతాస్తుతులు చెల్లించి దాని విరిచి, వారికిచ్చి - ఇది మీ కొరకు ఇయ్యబడుచున్న నా శరీరము; నన్ను జ్ఞాపకము చేసికొనుటకు దీనిని చేయుడని చెప్పెను. ఆ ప్రకారమే భోజనమైన తరువాత ఆయన గిన్నెయు పట్టుకొని - ఈ గిన్నె మీ కొరకు చిందింపబడుచున్న నా రక్తమువలననైన క్రొత్త నిబంధన."

ఈ విధముగా నా తండ్రిగారు నా ప్రశ్నలన్నింటికీ సమాధానములనిచ్చి నాకు జ్ఞానము ప్రసాదించిరి. కాని నేను నా హృదయములోనింకను క్రైస్తవుడను కాలేదు. నా తలిదండ్రుల సమక్షమందునూ, వారి మిత్రులు చూచు చున్నప్పుడునూ నేను క్రైస్తవునివలె నటించుచుంటిని. కాని నా స్నేహితులతోనున్నప్పుడు నేను క్రైస్తవుడను కానట్లే ప్రవర్తించుచుంటిని.

నా తల్లిగారు నా చెల్లినీ నన్నూ ఏప్రియల్ నెల 1953లో, కీర్తిశేషులు శ్రీ జి. ఆర్. లార్న్ గారను దైవసేవకుడు ఏర్పరచిన క్రైస్తవ సమావేశములకు తీసుక వెళ్ళినారు. ఆ సమావేశములలో బైబిలులోని సందేశములనుబట్టి నేనొక ఘోర పాపినని నా అంతర్యములో నిర్ధారించబడెను. నేను ఏకాంతముగా మోకరించి ప్రార్థింపనారంభించితిని. అప్పుడు నేను చేసిన పాపములన్నియు, నొకదాని తరువాతనొకటిగా, నా కండ్లయెదుట కన్పడ మొదలైనది. ఓదార్చబడలేనంతగా ఏడ్పు దానంతటదే మొదలైనది. నా పాపములను క్షమించుమని యేసు క్రీస్తును మనస్పూర్తిగా ప్రార్థించి వేడుకొన ఆరంభించితిని. నా పాపములచే నేను కూడ యేసు క్రీస్తును సిలువ వేయుటలో భాగస్వామినే యని బాధతో యేసు క్రీస్తును విన్నవించుకొంటిని. నన్ను కరుణించి నా పాపములనుంచి నన్ను శుద్ధీకరించుమని ప్రార్థించుకొంటిని. ఆలాగు నా పాపములు నా కండ్లయెదుట కన్పడుచున్నంత వరకు క్షమాభిక్షవేడగా, ఎట్టకేలకు నా హృదయములో అపరిమితానందము కల్గినది. అంతేగాక బైబిలులో యెహెజ్కేలను ప్రవక్త వ్రాసిన గ్రంథము 36వ అధ్యాయములోని 25వ వచనము నుండి 28వ వచనమువరకునున్న భాగము నా కగుపడినది. ఆ భాగమందీ విధముగా వ్రాయబడియున్నది: "మీ అపవిత్రత యావత్తు పోవునట్లు నేను

మీమీద శుద్ధజలము చల్లుదును, మీ విగ్రహములవలన మీకు కలిగిన అపవిత్రత అంతయు తీసివేసెదను. నూతన హృదయము మీకిచ్చెదను, నూతన స్వభావము మీకు కలుగజేసెదను, రాతిగుండె మీలోనుండి తీసివేసి మాంసపుగుండెను మీకిచ్చెదను. నా ఆత్మను మీయందుంచి, నా కట్టడలననుసరించువారినిగాను నా విధులను గైకొనువారినిగాను మిమ్మును చేసెదను. నేను మీ పితరులకిచ్చిన దేశములో మీరు నివసించెదరు, మీరు నా జనులైయుందురు నేను మీ దేవుడనైయుందును."

ఆ క్షణమందే, ఆ స్థలమందే యేసు క్రీస్తును నా స్వంత రక్షకునిగా స్వీకరించి, నా హృదయములో క్రైస్తవుడనైతిని. నరకమునుండి దేవుని కృప వలననే రక్షింపబడితిని.

ప్రియ చదువరులారా, దేవుని ప్రేమ నన్ను పాపమునుండి రక్షించి నిత్యజీవము దయచేసినదన్న విషయమును మీయందరకూ తెలియజేయుట నాకెంతో సంతోషముగామున్నది. మీరే స్వయముగా బైబిలు గ్రంథమును పఠించి యేసు క్రీస్తు సందేశములను పరీక్షించుడి. మీకునూ దేవుడు తన కృపననుగ్రహించి రక్షించుగాకయని ప్రార్థిస్తున్నాను.

ఎమ్. ఎస్. పాల్.,
హైదరాబాదు, ఇండియా.